


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 07-08-2026 | సంపుటి - 31 | సంచిక - 74 | రూ : 4 | పేజీలు : 8


# పంద్రాగస్టు నుంచి కొత్త రేషన్ కార్డులు

## 119 నియోజకవర్గాల్లో 1.05 కోట్ల కొత్త కార్డుల పంపిణీకి ఏర్పాట్లు

- లామినేషన్‌తో తెల్ల రేషన్‌కార్డులు
- కొత్త కుటుంబాల్లో సరికొత్త ఆశలు



హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 15 నుంచి 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పేదల కోసం కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. అది కూడా ఒకేసారి దాదాపు 1.05 కోట్ల కార్డులు ఇవ్వాలని భావిస్తున్నారు. గడచిన పదేండ్లలో కొత్త రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే తెలంగాణలో దాదాపు 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి తరువాయి 2లో



# ఓఆర్‌ఆర్‌లో నిర్వహణ లోపం

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కనిపిస్తోంది
- ఎక్కడికక్కడ వాహనాలు నిలపడంతో ప్రమాదాలు
- హెచ్‌ఆర్‌డీసీఎల్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




# హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్లౌడ్ రీజియన్

## ఏఐ సేవలకు మరింత ఊతం

- హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్లౌడ్ రీజియన్ ప్రారంభం
- దేశవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌కు ఇది నాలుగో క్లౌడ్ సెంటర్
- భారత్‌లో ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సేవలను బలోపేతం చేయడమే లక్ష్యం

ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, భారత్‌లో తన క్లౌడ్ సేవలను మరింత విస్తరించింది. హైదరాబాద్ కేంద్రంగా "ఇండియా సౌత్ సెంట్రల్" పేరుతో తన నూతన క్లౌడ్ రీజియన్‌ను గురువారం ప్రారంభించింది. ఈ కొత్త కేంద్రం ఏర్పాటుతో దేశంలో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. తరువాయి 2లో

### అంతరిక్షంలోకి 13.5 లక్షల మంది పేర్లు..

# నాసా సరికొత్త ప్రయోగం!



- రోమన్ స్పేస్ టెలిస్కోప్‌పై స్మారక ఫలకం ఏర్పాటు
- భూమికి దాదాపు పది లక్షల మైళ్ల దూరంలోకి ప్రయాణం
- విశ్వ రహస్యాలు, డార్క్ మ్యాటర్‌పై పరిశోధనలు
- ఆగస్టు 30న ఫాల్కన్ హెవీ రాకెట్‌తో ప్రయోగం

2లో

### ఎన్నికలకు సిద్ధంకండి..

# ప్రతి ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలు ఉండండి



- మంత్రులకు నారా లోకేశ్ సూచన
- స్థానిక ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయన్న నారా లోకేశ్
- భారీ విజయం లక్ష్యంతో క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచన
- ఎల్-నినో పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్న లోకేశ్

2లో

### రైతుల కోసం కేంద్రం

# రూ.23,731 కోట్ల 'గోబర్‌ధన్' పథకం

## పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం

- పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు పెరగనున్న డిమాండ్
- సీబీజీ ఉత్పత్తిని పది రెట్లు పెంచే లక్ష్యం
- సీబీజీకి ప్రభుత్వం మద్దతుతో స్థిర ధర
- కొత్త బయోగ్యాస్ ప్లాంట్లకు రూ.2 కోట్ల వరకు సాయం
- గ్రామీణ ఉపాధి, పెట్టుబడులకు ఊతం



2లో

### హిరోషిమా విధ్వంసానికి 81 ఏళ్లు..

# అణు ప్రమాదాలపై ప్రపంచానికి జపాన్ వార్నింగ్

- హిరోషిమాపై అణుబాంబు దాడి జరిగి 81 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జపాన్‌లో స్మారక కార్యక్రమం
- అణ్వాయుధాల వల్ల జరిగే విధ్వంసాన్ని తక్కువ చేయొద్దని హిరోషిమా మేయర్ హెచ్చరిక



### డీప్‌ఫేక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

# 3 గంటల్లో తొలగించాల్సిందే

- సున్నితమైన ఫిర్యాదుల పరిష్కారానికి 2 గంటలే
- ఏఐ కంటెంట్‌కు గుర్తింపు వివరాలు తప్పనిసరి
- ఆటోమేటెడ్ వ్యవస్థలతో పర్యవేక్షణ
- డీప్‌ఫేక్ గుర్తింపునకు ఐఐటీల సాంకేతికత
- ఫిర్యాదుల కోసం అప్పీల్ వ్యవస్థ, 'సహయోగ్' పోర్టల్



# పంద్రాగస్టు నుంచి కొత్త రేషన్ కార్డులు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 15 నుంచి 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పేదల కోసం కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. అది కూడా ఒకేసారి దాదాపు 1.05 కోట్ల కార్డులు ఇవ్వాలని భావిస్తున్నారు. గడచిన పదేండ్లలో కొత్త రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే తెలంగాణలో దాదాపు 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి ఇప్పుడు ఇవ్వనున్న 1.05 కోట్ల కొత్త కార్డులు అదనం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అడపాదడపా 19 లక్షల వరకు కొత్త తెల్లకార్డులు ఇచ్చింది. కొందరికి ఇచ్చి, మరికొందరికి ఇవ్వకపోవడంతో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతూ వస్తున్నది. దీన్ని గమనించిన సీఎం రేవంత్‌రెడ్డి అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు.

**ఇవీ అర్హతలు**

తెల్ల రేషన్‌కార్డుకు ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు ఖరారు చేసింది. వీటి ప్రకారం అర్హులను గుర్తిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల లోపు ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లించే వారు అనర్హులు. కొత్తగా ఇచ్చే తెల్ల రేషన్‌కార్డుల్ని లామినేషన్ చేసి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వ సబ్సిడీలతోపాటు ఉచిత బియ్యం కూడా లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు తెల్ల రేషన్‌కార్డు తప్పనిసరి అయ్యింది. అలాగే ఆరోగ్య శ్రీ వైద్యసేవలకు కూడా తెల్ల రేషన్‌కార్డు తప్పనిసరి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఆరోగ్య శ్రీ వైద్యసేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్‌కార్డునే ప్రామాణికంగా గుర్తిస్తున్నారు.

**సుదీర్ఘ నిరీక్షణ**

ముఖ్యంగా తల్లిదండ్రుల రేషన్‌కార్డుల్లో పేర్లు ఉన్న ఎంతో మంది యువతీయువకులు పెళ్లిళ్లు చేసుకున్నారు. వారంతా ఆయా కుటుంబాలతో వేరపడ్డారు. చిన్న కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు కావాలని అభిలషిస్తున్నారు. పెండ్లిండ్లు చేసుకొని అత్తగారింటికి వెళ్లిన ఆడపిల్లల పేర్లు ఇప్పటికీ పుట్టింటి రేషన్‌కార్డుల్లోనే ఉన్నాయి. పేర్ల మార్పు, చేర్పులకు సవాలక్ష నిబంధనలు అడ్డుగా ఉండటంతో అందరికీ ఇబ్బందిగానే ఉంది. రేషన్‌కార్డులోంచి ఎవరిపేరన్నా తొలగిస్తే, మొత్తానికే కార్డు పోతుందనే భయంతో మరికొందరు అలాంటి ప్రయత్నాలు కూడా చేయలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కొత్త కుటుంబాలకు భరోసాను ఇస్తున్నది.

**గ్రామీణంలో..**

గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని కూలీలు, పట్టణాల్లో అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాలు, కొత్తగా విడిపోయిన కుటుంబాలు, కొత్త పెళ్లిళ్లు జరిగిన జంటలు, ఇప్పటివరకు కార్డు లేని నిరుపేదలు కొత్త కార్డుల కోసం ఎక్కువగా ఎదురు చూస్తున్నారు. అలాంటి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పెద్ద ఊరటనిస్తోంది. వారికి రేషన్‌దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇస్తున్నారు.

*** 15న సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం**

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కొత్తరేషన్‌కార్డుల్ని అందచేస్తున్నదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆగస్టు 15న ఈ కార్యక్రమాన్ని సీఎం ఏ రేవంత్‌రెడ్డి సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభిస్తారని వివరించారు. ఆ వెంటనే అన్ని నియోజకవర్గాల్లో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) సమన్వయంతో జిల్లాల యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారికి కొత్త కార్డులు ఇవ్వడంతో పాటు కొత్త దరఖాస్తుల్ని కూడా స్వీకరిస్తామని చెప్పారు. లబ్ధిదారుల జాబితాల □ఖరారు నుంచి కార్డుల ముద్రణ, □రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారుల్ని ఆదేశించారు. కొత్త రేషన్‌కార్డులపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు మంత్రి జూపల్లి కృష్ణారావు ఓ □ప్రకటనలో తెలిపారు.

## ఎన్నికలకు సిద్ధంకండి..
## ప్రతి ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలు ఉండండి

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన ప్రజా సమస్యలపై తన సహచర మంత్రులకు నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. స్థానిక పోరు అనుకున్న సమయానికే జరుగుతుందని స్పష్టం చేసిన లోకేశ్, కూటమి అభ్యర్థుల భారీ విజయానికి పక్కా ప్రణాళికతో క్షేత్రస్థాయికి వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా నాయకులు ప్రతి ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలైనా గడిపి, వైసీపీ ప్రభుత్వ విధ్వంసాన్ని, కూటమి ప్రభుత్వం తెచ్చిన సంక్షేమాన్ని క్షుణ్ణంగా వివరించాలని స్పష్టం చేశారు. ఈ ఉదయం మంత్రులతో నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ మేరకు సూచించారు. ఇదే సమావేశంలో అసెంబ్లీ వ్యూహంపైనా చర్చించారు. రాష్ట్రంలో ఉన్న ఎల్‌నినో పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సూచించారు. జలాశయాల్లోకి నీరు చేరుతుండటం కొంత ఊరటనిచ్చినప్పటికీ... ప్రభుత్వం వైపు నుంచి తొలి ప్రాధాన్యత తాగునీటి సరఫరాకే ఇవ్వాలని, ఆ తర్వాత పశుగ్రాస కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శాసనసభను సరైన వేదికగా మలుచుకోవాలని మంత్రులకు పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్లౌడ్ రీజియన్

ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, భారత్‌లో తన క్లౌడ్ సేవలను మరింత విస్తరించింది. హైదరాబాద్‌కేంద్రంగా "ఇండియా సౌత్ సెంట్రల్" పేరుతో తన నూతన క్లౌడ్ రీజియన్‌ను గురువారం ప్రారంభించింది. ఈ కొత్త కేంద్రం ఏర్పాటుతో దేశంలో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎంటర్‌ప్రైజ్ సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ వెల్లడించింది. తెలంగాణలో ఏర్పాటైన ఈ నూతన రీజియన్ ద్వారా వినియోగదారులు తమ డేటాను స్థానికంగానే భద్రపరుచుకోవచ్చు. దీనివల్ల అత్యున్నత భద్రతతో పాటు వేగవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే పూణె, చెన్నై, ముంబై నగరాల్లో మైక్రోసాఫ్ట్‌కు క్లౌడ్ రీజియన్లు ఉండగా, తాజా విస్తరణతో భారత్‌లో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ నెట్‌వర్క్ కలిగిన సంస్థగా మైక్రోసాఫ్ట్ నిలిచింది. సేవల్లో ఎలాంటి అంతరాయాలు కలగకుండా ఉండేందుకు వీలుగా ఈ కేంద్రంలో మూడు అవైలబిలిటీ జోన్‌లను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, 2030 నాటికి నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించే లక్ష్యంతో ఇందులో "జీరోవాటర్ కూలింగ్" సాంకేతికతను వినియోగిస్తున్నారు. అదానీ గ్రూప్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పీబీ పే వంటి ప్రముఖ భారతీయ సంస్థలు ఇప్పటికే ఈ హైదరాబాద్ రీజియన్ సేవలను వినియోగించుకుంటున్నాయి. భారత్‌లో డిజిటల్, ఏఐ మౌలిక సదుపాయాల కోసం మైక్రోసాఫ్ట్ ప్రకటించిన 20.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులలో భాగంగా ఈ నూతన రీజియన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ మాట్లాడుతూ, ఏఐ సాంకేతికతతో విలువైన ఫలితాలను సాధించాలంటే, డేటాకు సమీపంలో నమ్మకమైన మౌలిక సదుపాయాలు ఉండటం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

## అంతరిక్షంలోకి 13.5 లక్షల మంది పేర్లు.. నాసా సరికొత్త ప్రయోగం!

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' మరో అద్భుత ప్రయోగానికి సిద్ధమైంది. తన నాన్సీ గ్రేస్ రోమన్ స్పేస్ టెలిస్కోప్‌తో పాటు ఏకంగా 13.5 లక్షల మంది పేర్లను అంతరిక్షంలోకి పంపనుంది. ఈ టెలిస్కోప్ భూమి నుంచి దాదాపు పది లక్షల మైళ్ల (1.6 మిలియన్ కిలోమీటర్లు) దూరానికి ప్రయాణించనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు సమర్పించిన 13,50,144 పేర్లతో కూడిన ఒక మెమరీ కార్డును స్మారక ఫలకంలో అమర్చారు. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్‌లో జులై చివరిలో టెక్నీషియన్లు ఈ ఫలకాన్ని టెలిస్కోప్‌కు విజయవంతంగా బిగించారు. ఈ పేర్లలో ఆర్టెమిస్ 2, 3 మిషన్ల వ్యోమగాముల పేర్లు కూడా ఉన్నాయి. నాసా తొలి చీఫ్ ఆస్ట్రానమర్, 'హబుల్ మదర్'గా పేరుగాంచిన డాక్టర్ నాన్సీ గ్రేస్ రోమన్‌కు గౌరవ సూచకంగా ఈ ఫలకాన్ని ఏర్పాటు చేశారు.

సూర్యుడుభూమి లాగ్రాంజ్ పాయింట్ 2 (L2) వద్ద ఈ రోమన్ టెలిస్కోప్ పనిచేస్తుంది. ప్రస్తుతం జేమ్స్ వెబ్ టెలిస్కోప్ కూడా ఇదే ప్రాంతంలో ఉంది. ఇది హబుల్ టెలిస్కోప్ కంటే దాదాపు 100 రెట్లు పెద్ద వీక్షణను అందించే కెమెరాతో సుదూర గ్రహాలను అన్వేషిస్తుంది. డార్క్ ఎనర్జీ, డార్క్ మ్యాటర్‌పై పరిశోధనలు చేయడంతో పాటు వందల కోట్ల గెలాక్సీలను మ్యాపింగ్ చేస్తుంది. నాసా, స్పేస్‌ఎక్స్ సంస్థలు కలిసి ఈ టెలిస్కోప్‌ను ఆగస్టు 30న ప్రయోగించడానికి లక్ష్యంగా పెట్టుకున్నాయి. కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్ హెవీ రాకెట్ ద్వారా దీనిని నింగిలోకి పంపనున్నారు. విశ్వాన్ని అన్వేషించే వ్యోమనౌకలపై మానవ గుర్తుగా పేర్లను పంపే సంప్రదాయాన్ని నాసా కొనసాగిస్తోంది.

## డీప్‌ఫేక్‌లపై కేంద్రం ఉక్కుపాదం..
## 3 గంటల్లో తొలగించాల్సిందే

సోషల్ మీడియాలో కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న డీప్‌ఫేక్ వీడియోలు, ఆడియోలు, ఫొటోలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను మరింత కఠినతరం చేసింది. అక్రమ కంటెంట్‌పై ఫిర్యాదు అందిన మూడు గంటల్లోనే తొలగించాలని మధ్యవర్తి వేదికలకు (ఇంటర్మీడియరీలు) ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈ గడువు 36 గంటలు ఉండేది. లోక్‌సభలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఈ వివరాలు వెల్లడించారు. డీప్‌ఫేక్‌లు, ఏఐతో రూపొందించిన తప్పుడు సమాచారం పెరుగుతున్న నేపథ్యంలో ఐటీ నిబంధనలను బలోపేతం చేసినట్లు చెప్పారు. నగ్న చిత్రాలు, వ్యక్తుల వేషధారణను అనుకరించడం, అశ్లీల కంటెంట్ వంటి సున్నితమైన అంశాలపై వచ్చే ఫిర్యాదులను ఇకపై రెండు గంటల్లోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. గతంలో ఇందుకు 24 గంటల గడువు ఉండేది. ఏఐతో రూపొందించిన కంటెంట్‌కు స్పష్టమైన గుర్తింపు, సోర్స్ వివరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికలను కేంద్రం ఆదేశించింది. దీంతో వినియోగదారులు అది నిజమైనదా, కృత్రిమంగా రూపొందించిందా అనేది సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది. చట్టాలను ఉల్లంఘించే డీప్‌ఫేక్ కంటెంట్ తయారీ, ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఆటోమేటెడ్ సాంకేతిక వ్యవస్థలను వినియోగించాలని కూడా సూచించింది. బాలల లైంగిక దోపిడీ, అనుమతి లేకుండా వ్యక్తిగత చిత్రాల ప్రచారం, వేషధారణ మోసాల వంటి కంటెంట్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. డీప్‌ఫేక్‌లను గుర్తించేందుకు ఐఐటీ జోధ్‌పూర్, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్ అభివృద్ధి చేసిన ప్రత్యేక వ్యవస్థలను కూడా కేంద్రం ప్రస్తావించింది. అలాగే ఫిర్యాదుల పరిష్కారం కోసం గ్రీవెన్స్ అధికారుల నియామకం, కేంద్ర స్థాయిలో అప్పీల్ వ్యవస్థ, 'సహయోగ్' పోర్టల్‌ను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.

## రైతుల కోసం కేంద్రం రూ.23,731 కోట్ల 'గోబర్‌ధన్' పథకం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయ అవశేషాలు, పశువుల వ్యర్థాలతో అదనపు ఆదాయం పొందేలా రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అవకాశం కల్పించింది. బయోగ్యాస్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రూ.23,731 కోట్ల వ్యయంతో 'గోబర్‌ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. 202627 నుంచి 2035 36 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశీయంగా 'కంప్రెస్డ్ బయోగ్యాస్' (సీబీజీ) ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. రైతుల నుంచి సేకరించే పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు డిమాండ్ పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయి. సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక కొనుగోలు విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే సీబీజీకి ప్రతి ఎంఎంబీటీయూకు రూ.2,110 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. దీనివల్ల ఉత్పత్తిదారులకు దీర్ఘకాలిక ఆదాయ భరోసా లభించనుంది. కొత్తగా ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లకు రోజుకు ఒక టన్ను ఉత్పత్తి సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు మూలధన సాయం అందించనున్నారు. ఇప్పటికే ఉన్న ప్లాంట్ల విస్తరణకు కూడా ఈ సాయం వర్తిస్తుంది. ముడి పదార్థాల సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం లభించనుంది. సీబీజీ ప్లాంట్లను గ్యాస్ పైప్‌లైన్లతో అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక వసతులకు మద్దతు ఇవ్వనున్నారు. ఎంఎస్‌ఎంఈ ఆధారిత ప్రాజెక్టులకు రుణ హామీ పథకం కూడా అమలు చేయనున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.

## హిరోషిమా విధ్వంసానికి 81 ఏళ్లు..
## అణు ప్రమాదాలపై ప్రపంచానికి జపాన్ వార్నింగ్

జపాన్‌లోని హిరోషిమా నగరంపై అమెరికా అణుబాంబు దాడి జరిగి నేటికి (గురువారం) 81 సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా నగరంలోని పీస్ మెమోరియల్ పార్క్‌లో ప్రత్యేక స్మారక కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, అణు ప్రమాదాల ముప్పుపై తీవ్ర ఆందోళనల నడుమ ఈ వార్షికోత్సవం జరిగింది. బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించారు. 1945 ఆగస్టు 6న ఉదయం 8:15 గంటలకు అణుబాంబు పేలిన కచ్చితమైన సమయానికి మౌనం పాటించి, మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తర్వాత హిరోషిమా మేయర్ కజుమీ మట్సుయి శాంతి ప్రకటనను విడుదల చేశారు. అణ్వాయుధాల వల్ల కలిగే తీవ్ర విధ్వంసాన్ని గుర్తుచేస్తూ, బహుళపాక్షిక చర్చల ద్వారా అణ్వస్త్ర వ్యాప్తిని నిరోధించి, పూర్తి నిర్మూలనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. "అణ్వాయుధాల అమానవీయతను తక్కువ అంచనా వేసి, స్వప్రయోజనాల కోసం హింసను ఆమోదిస్తే.. అది మరో హిరోషిమా లేదా నాగసాకి విధ్వంసానికి దారితీయవచ్చు" అని ఆయన హెచ్చరించారు. అణుబాంబు దాడి నుంచి బతికి బయటపడిన వారి సంఖ్య తగ్గుతున్నందున, అణ్వాయుధ రహిత ప్రపంచం కోసం యువతరం చొరవ తీసుకోవాలని కోరారు. 1945లో హిరోషిమాపై జరిగిన దాడిలో ఆ ఏడాది చివరి నాటికి సుమారు 1,40,000 మంది మరణించారు. ఆ తర్వాత మూడు రోజులకు నాగసాకి నగరంపై మరో అణుబాంబును అమెరికా ప్రయోగించింది. ప్రపంచంలో అణు దాడులకు గురైన ఏకైక దేశంగా జపాన్ అప్పటి నుంచి మూడు అణు వ్యతిరేక సూత్రాలను (అణ్వాయుధాలను కలిగి ఉండరాదు, ఉత్పత్తి చేయరాదు, దేశంలోకి అనుమతించరాదు) పాటిస్తోంది. అయితే, షిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం ఇటీవలి కాలంలో ప్రధాని సనే టకాయిచి నేతృత్వంలోని అధికార పక్షంలో ఈ సూత్రాలను సవరించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ముఖ్యంగా జపాన్ భూభాగంలోకి అణ్వాయుధాలను అనుమతించేలా నిబంధనను మార్చాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు వార్తలు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ ఈ ఆలోచనను వ్యతిరేకిస్తూ దేశంలోని 36 ప్రిఫెక్చర్‌లకు చెందిన 128 స్థానిక శాసనసభలు జపాన్ పార్లమెంట్ (డైట్)కు తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా పంపాయి. ఈ స్థాయిలో వ్యతిరేకత రావడం ఇదే తొలిసారి.

## ఓఆర్ఆర్‌లో నిర్వహణ లోపం

హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణ సరిగా లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓఆర్ఆర్ నిర్వహణలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ఎక్కడికక్కడ వాహనాలను నిలపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఓఆర్ఆర్ నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని రకాల రోడ్డు నెట్‌వర్క్‌లను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో హెచ్‌ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌డీసీఎల్) అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "భూసేకరణ, రుణాలు, రోడ్ల నిర్వహణ సహా అన్ని అంశాలూ ఈ సిస్టంలోకి తీసుకురావాలి. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, నగరంలోని ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, ఇతర రోడ్లు ఇందులోకి రావాలి. టీడీఆర్‌పై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం సేకరించిన భూములకు మాత్రమే టీడీఆర్ చేయాలి. టీడీఆర్ ప్రక్రియ మొత్తాన్ని ఆన్‌లైన్ చేయాలి. ఈ ప్రక్రియలో అవకతవకలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ వ్యవస్థను రూపొందించాలి. రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి. కొంగర కలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకూ రేడియల్ రోడ్ 1ను డిసెంబరు 9 లోగా పూర్తి చేయాలి. రహదారుల నిర్మాణ నాణ్యతలో రాజీ పడొద్దు. రోడ్లకు ఇరువైపులా పచ్చదనాన్ని పెంచే చర్యలు చేపట్టాలి. బుద్వేల్ ఇంటర్‌ఛేంజ్ ట్రంపెట్ అత్యంత కీలకం. ఎలివేటెడ్ కారిడార్స్ 1, 2 పనులు వేగవంతం చేయాలి. బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ రోడ్ పనులను త్వరగా మొదలు పెట్టాలి. రహదారుల అభివృద్ధిపైనే హైదరాబాద్ భవిష్యత్ ఆధారపడి ఉంది. భూసేకరణను వేగవంతం చేయాలి. అలసత్వం చూపించొద్దు. రోడ్ల ప్లానింగ్, నిర్మాణంలో ట్రాఫిక్ విభాగాన్ని ఇన్‌వాల్వ్ చేయాలి. ల్యాండ్ పూలింగ్‌లో మధ్యవర్తుల జోక్యాన్ని సహించొద్దు" అని సీఎం ఆదేశించారు.

## కొత్త ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుతో భారతీయులకే తీవ్ర నష్టం

: **శశి థరూర్**

విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (FCRA) సవరణ బిల్లు 2026పై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. విదేశీ నిధుల నియంత్రణ పేరిట కేంద్రం తెస్తున్న ఈ సవరణల వల్ల పారదర్శకత పెరగకపోగా... దేశంలోని విద్యా సంస్థలు, ఆసుపత్రులు, సేవా సంస్థలను నడిపే సామాజిక వర్గాలు, ముఖ్యంగా మైనారిటీలు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కొత్త చట్టం ద్వారా ప్రభుత్వం విపరీతమైన అధికారాలను తన చేతుల్లోకి తీసుకుంటోందని థరూర్ ఆరోపించారు. ఏదైనా సంస్థకు చెందిన ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరణ కాకపోతే లేదా రద్దయితే... ఆ విదేశీ నిధులతో దశాబ్దాలుగా నిర్మించిన ఆస్తులను, ఆసుపత్రులను, పాఠశాలలను స్వాధీనం చేసుకునే లేదా విక్రయించే అధికారాన్ని ప్రభుత్వం సొంతం చేసుకోవడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. నియంత్రణ పేరుతో పౌర సమాజాన్ని, స్వచ్ఛంద సంస్థలను క్రమంగా దెబ్బతీయడం వల్ల అంతిమంగా నష్టపోయేది సామాన్య భారతీయులేనని పేర్కొన్నారు. ఈ బిల్లును వెంటనే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపాలని, లేని పక్షంలో ప్రజాస్వామ్య బద్ధంగా తీవ్ర నిరోధకతను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ పాదయాత్రలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ప్రజా స్ఫూర్తి:కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తూ దేశాన్ని సంక్షోభంలోకి నెడుతోందని సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 14 వరకు జిల్లా కేంద్రంలోని అన్ని కాలనీల్లో నిర్వహించనున్న పాదయాత్రలకు గురువారం కొమురయ్య భవన్ నుంచి శ్రీకారం చుట్టారు. అనంతరం కృష్ణ కాలనీ, యాదవ్ కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినా ఆ ప్రయోజనం ప్రజలకు అందడం లేదని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని, ఉచిత విద్య, వైద్యం అందుబాటులోకి తేవాలని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, రైతులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు నూకల చంద్రమౌళి, ఎండి జాఫర్, నేరెళ్ల జోసెఫ్, భూక్య గణేష్, కంకల గట్టయ్య, గోలి లావణ్య, పొన్నగంటి లావణ్య, పల్లెల రజిత, గడ్డం స్వరూప, ఇటుకల శ్రీలత, పోతుగంటి స్వప్న, రాజేష్, సదానందం, పీక రవి, జనార్ధన్, రమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్‌కు బీఆర్ఎస్ ఘన నివాళి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత బలాన్ని అందించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు.పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువులో రాణించాలి

* **జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల శ్రేయస్సు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధి రాజేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌళిక సదుపాయాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారి చదువులు, భవిష్యత్ లక్ష్యాలు, అభిరుచుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానం, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పరిశీలిస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు మరింత కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనీఫామ్స్ ప్రతి విద్యార్థికి అన్ని సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, విద్యా శాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్తకు ఎస్పీ ఘన నివాళి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అన్నారు. జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో కుట్ర రాజకీయాలు సహించం

* **డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో వ్యక్తిగత స్వార్థం, పదవుల రాజకీయాల కోసం కొందరు నాయకులు కావాలనే వర్గ విభేదాలను రెచ్చగొడుతూ పార్టీని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆరోపించారు. ఇలాంటి కుట్ర రాజకీయాలను కార్యకర్తలు ఎప్పటికీ సహించరని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.గురువారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలిసి కొందరు కార్యకర్తలను ప్రత్యేకంగా హైదరాబాద్ గాంధీభవన్‌కు తీసుకెళ్లి తనపై ఆరోపణలు చేయించారని ఆరోపించారు. ఇది కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కాకుండా కొందరు నాయకులు ఆడుతున్న రాజకీయ నాటకమని విమర్శించారు.

* **'నన్ను నాన్-లోకల్ అనడం అవమానమే'**

తనను నాన్‌లోకల్‌గా చిత్రీకరించడం జిల్లా ప్రజలను, ఆదివాసీ సమాజాన్ని అవమానించడమేనని సుగుణక్క అన్నారు. తాను సిర్పూర్ (యూ) మండలం పుల్లార గ్రామంలో జన్మించి, ఈ నేలపై పెరిగిన ఆదివాసి బిడ్డనని పేర్కొన్నారు. ఈ మట్టిపై తనకు ఉన్న హక్కును ప్రశ్నించే నైతిక అధికారం ఎవరికీ లేదన్నారు.

* **'పార్టీ మారలేదు.. అధిష్ఠానం నమ్మకమే పదవులు'**

1995లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీటీసీగా గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీ మారలేదని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ ఇచ్చిందని, అనంతరం తన పనితీరు, పార్టీ పట్ల నిబద్ధతను గుర్తించిన అధిష్ఠానం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, డీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిందని చెప్పారు. ఆ నిర్ణయాన్ని కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రశ్నించడం అంటే పార్టీ అధిష్ఠానాన్నే సవాల్ చేయడమేనని వ్యాఖ్యానించారు.

* **క్రమశిక్షణ దెబ్బతీస్తే సహించం**

పదవులు రాక అసంతృప్తిని పార్టీపైకి మళ్లిస్తూ కార్యకర్తలను రెచ్చగొట్టి కాంగ్రెస్ ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని ఆమె విమర్శించారు. తాను ఎవరిపైనా కక్షతో రాజకీయాలు చేయనని, కానీ పార్టీ క్రమశిక్షణను దెబ్బతీసే చర్యలను మాత్రం సహించబోనని స్పష్టం చేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా పార్టీ జెండా కింద ఐక్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, మండల అధ్యక్షులు రాపర్తి మురళి, మీర్ కాసిమ్ ఇమ్రాన్, సుజియత్, రషీద్, కిషన్ గౌడ్, గణపత్, మెంగాజీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదవేణి మల్లేష్, తరిక్, కట్కూర్ భీమన్న, శోభన్, చిరంజీవి, ప్రకాష్, బాదు పటేల్, శంకర్, పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా కోఆర్డినేటర్ కోవ ఇందిర, ఆత్మ చైర్మన్ గడ్డల సత్తయ్య, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు కమల్ నాథ్ రెడ్డి, నాంపల్లి శంకర్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుజాయిత్ ఖాన్, మెంగాజీ, రషీద్, ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ ఉండాలి

* **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజా స్ఫూర్తి, భైంసా : ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు అందరినీ నిరంతరం ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం రాత్రి సారంగాపూర్ మండలం జామ్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీని) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేజీబీవీ పరిసరాలను పరిశీలించారు. ప్రతిరోజు పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులందరికీ అన్ని పూటలా మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాలలోని మొత్తం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సంఖ్య ప్రస్తుత హాజరు, వారికి అందిస్తున్న విద్య కల్పిస్తున్న సౌకర్యాలు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ వివరాలను వారిని అడిగారు. ఇంగ్లీషు సబ్జెక్టులో పూర్తయిన పాఠానికి సంబంధించి విద్యార్థులకు పరీక్షను నిర్వహించారు. విద్యార్థులకు పెన్నులను బహుమతులుగా అందించారు. చక్కగా చదువుకుని బోర్డు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని, జిల్లాకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సబ్జెక్టుల్లో ఎటువంటి సందేహాలు ఉన్నా సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. ప్రతిరోజు విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకోవాలన్న ఆలోచనను కలిగి ఉండాలని అన్నారు.ఈ తనిఖీలో విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ విజయకాంత్, ఎంపీడీవో లక్ష్మీకాంతారావు, ఎంపీఓ అజీజ్ ఖాన్, సర్పంచ్ కరిపే రవళి విలాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలి

* **జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : శిశువు జన్మించిన మొదటి గంటలోనే ఇచ్చే జున్ను పాలు బిడ్డకు వేసే తొలి సహజసిద్ధమైన టీకా వంటిదని, ప్రతి ఒక్కరూ తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. గురువారం ఆదిలాబాదు గ్రామీణ మండలం సిరికొండ గ్రామంలో నిర్వహించిన 'ప్రపంచ తల్లి పాల వారోత్సవాల' ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవజాత శిశువుకు తల్లి పాలే శ్రేష్ఠమైన ఆహారమని, ప్రసవమైన మొదటి గంటలోనే బిడ్డకు జున్ను పాలు తాగించడం వల్ల వారికి అవసరమైన రోగనిరోధక శక్తి లభిస్తుందన్నారు. మొదటి ఆరు నెలల పాటు శిశువుకు నీళ్లతో సహా ఎలాంటి ఇతర ఆహారం గానీ, డబ్బా పాలు గానీ ఇవ్వకూడదని, కేవలం తల్లి పాలను మాత్రమే అందించాలని సూచించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి, అంగన్వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌లను సందర్శించారు.కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన పలువురు చిన్న పిల్లలకు కలెక్టర్ చేతుల మీదుగా అన్నప్రాసన చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, గ్రామ సర్పంచ్ మాధవి కిషన్, ఆదిలాబాదు గ్రామీణ మండల తహసీల్దార్ గోవింద్, సీడీపీఓ సౌందర్య, వైద్యాధికారిణి డాక్టర్ ఆశాకిరణ్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పనులు ప్రారంభం కాకపోతే కాంట్రాక్టర్‌ను మార్చాలి

* **ఏపీ ఆర్అండ్‌బీ మంత్రికి రాష్ట్ర మంత్రి తుమ్మల విజ్ఞప్తి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం నుంచి వాజేడు వరకు అధ్వాన్నంగా మారిన రహదారికి తక్షణమే మోక్షం కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని కోరారు. గురువారం ఈ మార్గంలో ప్రయాణించిన సందర్భంగా రహదారి దుస్థితిపై స్థానికులు మంత్రిని అడ్డుకుని తమ సమస్యలను వివరించారు. గతంలో తుమ్మల ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్నప్పుడు ఈ రహదారి నిర్మాణం జరిగిందని, తరువాత ఎలాంటి మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 100 కిలోమీటర్ల ప్రయాణానికే మూడు గంటల సమయం పడుతోందని, ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు తెలిపారు. ప్రజల సమస్యలను విన్న వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి, సంబంధిత అధికారులకు, తెలంగాణ ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. రహదారి మరమ్మతులు, అభివృద్ధి పనులను అత్యవసరంగా ప్రారంభించి ప్రజల కష్టాలకు ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తుమ్మల స్థానికులకు హామీ ఇవ్వడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. రహదారి అభివృద్ధి పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించినప్పటికీ కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం విచారకరమని, వారం రోజుల్లోగా పనులు ప్రారంభం కాకపోతే ప్రస్తుత కాంట్రాక్టర్‌ను తొలగించి, కొత్త టెండర్లు పిలిచి పనులను వేగవంతం చేయాలని కోరారు. దీనిపై మంత్రి జనార్ధన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఘనంగా మాజీ శాసనసభ్యులు పుట్టినరోజు వేడుకలు

ప్రజా స్ఫూర్తి , భైంసా : నిర్మల్ జిల్లా భైంసా పట్టణ కేంద్రంలోని రమేష్ మాశెట్టి వార్ గారి సుభాద్ర ఫ్యాక్టరీలో మాజీ శాసనసభ్యులు గడ్డి గారి విట్టల్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏఎంసి చైర్మన్ ఎండి ఫారుక్ అహ్మద్ గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, రమేష్ మశెట్టి వార్, సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, చోండి రాజెశ్వర్ ఏం సి డైరెక్టర్ భూమన్న డైరెక్టర్, దేవిదాస్ ఏఎంసి డైరెక్టర్ కిష్టయ్య, మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, ప్రసాద్ పటేల్,రామ్ కుమార్ మాజీ సర్పంచ్, ఏఎంసి డైరెక్టర్ రమేష్,ముత్యం కరోబరి, రాహుల్,నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేందర్, నవీన్ రెడ్డి మాజీ సర్పంచ్ శ్రీను విశ్వనాథ్ పాటిల్ మాజీ సర్పంచ్ అమరేందర్ రెడ్డి,మాజీ ఎంపిటిసి మాణిక్ రావు,పటేల్ మాజీ సర్పంచ్ ముత్యం మాజీ సర్పంచ్,గణేష్ మాజీ సర్పంచ్ దిగంబర్ పటేల్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ముధోల్ నియోజకవర్గం అధ్యక్షులు సాహెబ్ రావు,కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు దీక్షిత్, సాహెబ్ రావు కుంబి గ్రామ సర్పంచ్ విజయ్, హైమద్, నారాయణ, మహేష్ మోహన్ మాజీ జెడ్పిటిసి సాహెబ్ రావు పటేల్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ జయశంకర్ ప్రజా యుద్ధనౌక గద్దర్ కు నివాళులు

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మానుకోట జిల్లా కేంద్రంలో నలంద కళాశాల ఆవరణంలో మానుకోట జిల్లా జేఏసీ కళాకారుల ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ కు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మానుకోట జిల్లా కళాకారుల జేఏసీ జిల్లా కన్వీనర్ కంబాలపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో ముందు వరుసలో నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ప్రజలను తన మాటల ద్వారా ప్రజా యుద్ధ నౌక గద్దర్ తన పాటల ద్వారా చైతన్య పరిచిన తీరు అభినందనీయమని ఆయన కొనియాడారు. సెప్టెంబర్ 4వ తారీకు నాడు మానుకోట పట్టణం లో సకల కళల కళాకారుల సమ్మేళన ర్యాలీ 2000 మంది కళాకారులతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ జేఏసీ జిల్లా చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణ విచ్చేసి ప్రొఫెసర్ జయశంకర్, ప్రజాయుద్ధనౌక గద్దర్ పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు బుల్లెట్ వెంకన్న. కళాకారుల జేఏసీ కోకన్వీనర్ ఐలేష్,కోమిరే వెంకన్న జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు అక్కెర నాగేంద్ర చారి, మెరుగు రవీందర్ గౌడ్, పెరుమాండ్ల శ్రీనివాస్, కడారి ఉప్పలయ్య,నాగెల్లి మురళి, బొల్లంపల్లి శ్రీనివాస్,వాసం వెంకన్న,మెరుగు కనుకుల ఏకాంతం, దర్శనం యుగేందర్, బట్టు సురేందర్, జన్ను సారయ్య, మెరుగు మహేష్, బుర్ర శ్రీనివాస్, జమాండ్ల రాజశేఖర్, కీర్తి,అరెపెల్లి నరేష్, అడ్డూరి సుమలత,దేశెట్టి ప్రవీణ్, మేడ వెంకన్న,గుండె శ్రీనివాస్,మేడ వెంకన్న, నాగన బోయిన సింహాద్రి.తదితర ఉద్యమ కళాకారులు పాల్గొన్నారు.

## చింతకింది కృష్ణమూర్తిని పరామర్శించిన పోలీసు హెడ్ కానిస్టేబుల్స్




రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి తల్లి మల్లమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ సారంగపాణి, హనుమకొండ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సదయ్య, కొమ్మరెడ్డి రాజిరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మల్లమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేసి, కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని వారు కోరారు.

## ఆచార్య జయశంకర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

* **మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి**

,ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఆచార్య జయశంకర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ చిత్రపాటనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనేక ఉద్యమాలు జరిగాయని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో రాష్ట్రం అభివృద్ధి కి బాటలు పడినాయని అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ ని అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి, వైస్ చైర్మన్ షఫి వుల్లా, కౌన్సిలర్ , కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న. కౌన్సిలర్ లు గుణగంటి హేమ సతీష్, మన్నెం అరుణమల్లేష్, తహెర్ మున్నీర్ , ధరావత్ విజయ, నాయకులు బండారు వెంకన్న,పోతురాజు అనిల్, మున్సిపల్ ఇ ఇ కిరణ్, డి ఇ ప్రణయ్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మాధవి, గౌసుద్దిన్, జూనియర్ అసిస్టెంట్ లు యాదగిరి, ఎస్ ఎ స్ ఆర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## శాకాంబరీ అలంకరణలో భక్తులను ఆకట్టుకున్న శ్రీ నల్ల పోచమ్మ, శ్రీ ముత్యాలమ్మ అమ్మవార్లు



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : నేరేడ్మెట్ బోనాల మహోత్సవాల సందర్భంగా నేరేడ్మెట్ లోని శ్రీ నల్ల పోచమ్మ, శ్రీ ముత్యాలమ్మ అమ్మవార్లకు శాకాంబరీ దేవి స్వరూపంలో అత్యంత వైభవంగా ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దిన ఈ విశిష్ట అలంకరణలో అమ్మవార్లు భక్తులకు దివ్య దర్శనమిచ్చి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు.ప్రత్యేక అలంకరణ అనంతరం అమ్మవార్ల ఎదుట అద్దం ఏర్పాటు చేయగా, తమ అలంకరణను తిలకిస్తున్నట్లుగా ప్రతిబింబించిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ అపూర్వ దృశ్యాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి అమ్మవార్ల ఆశీస్సులు పొందారు.బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడగా, శాకాంబరీ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆధ్యాత్మిక శోభను మరింత పెంచింది.

## గోపాలపురం ప్రాథమిక పాఠశాలకు సీఎం రేవంత్ రెడ్డి రూ.30 లక్షలు మంజూరు

* **పాఠశాల పునరుద్ధరణ పనులకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు ఆదేశం**



ప్రజా స్ఫూర్తి, ఖమ్మం జిల్లా : తిరుమలాయపాలెం మండలం గోపాలపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితిపై వచ్చిన వార్తకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, జిల్లా కలెక్టర్ పాఠశాలను సందర్శించాలని ఆదేశించారని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోపాలపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాఠశాల భవనం, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గోపాలపురం ప్రాథమిక పాఠశాల భవనం కూలిపోయే పరిస్థితిలో ఉండటంతో గతంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం క్రింద ఎంపిక చేసి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టలేదని తెలిపారు.ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల చదువుకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రధానోపాధ్యాయురాలు నిమ్మతోట ఇందిరా తన సొంత నిధులు రూ.40 వేల వ్యయంతో తాత్కాలిక షెడ్ నిర్మించి తరగతులు నిర్వహించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. విద్యార్థుల పట్ల ఆమె చూపిన బాధ్యత, అంకితభావాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించిన సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు నిమ్మతోట ఇందిరాను జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయుల సేవా దృక్పథం ఆదర్శప్రాయమని ప్రశంసించారు. గోపాలపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రూ.30 లక్షలు మంజూరు చేశారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు అవసరమైన అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు. పాఠశాల పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి స్వయంగా ఈ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నందున నాణ్యతతో, వేగవంతంగా పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ విల్సన్ ఎంపీడీఓ సిలార్ సాహెబ్, పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యా శాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, ఏఎంఓ., ఎంఈఓ., సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

* **ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో యంగ్ డైనమిక్ డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నిరంతరం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ప్రత్యేక చొరవతో మెదక్ పట్టణంలోని 13వ వార్డులో రూ.1 కోటి 6 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఘనంగా శ్రీకారం చుట్టడం జరిగిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే మా ప్రభుత్వ ధ్యేయం. అభివృద్ధి అంటే కేవలం ప్రకటనలు కాదు, ప్రజల జీవితాల్లో కనిపించే మార్పు. మెదక్ పట్టణంలోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ, నాణ్యమైన రహదారులు, డ్రైనేజీలు, వంటి మౌలిక సదుపాయాలను అందించడం మా బాధ్యత" అని అన్నారు.13వ వార్డు ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మెదక్ అభివృద్ధి కోసం డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, కౌన్సిలర్ చెదల్ సంధ్య నవీన్ కుమార్, అస్తరుగల్ల బాలరాజ్, రాజశేఖర్, అరుణ, సిద్ధిరాములు, కోఆప్షన్ సభ్యురాలు అనూష తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టెండర్ ప్రక్రియ పూర్తి త్వరలో పనులు ప్రారంభం

* **ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



ప్రజా స్ఫూర్తి , భైంసా :నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గం లో ఆలయాల నిర్మాణానికి కోటి 50 లక్షల రూపాయల నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ సైతం పూర్తి అయినట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు నిధులు మంజూరు కావడంతో పాటు టెండర్ ప్రక్రియ సైతం పూర్తి కావడం జరిగిందని పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు. ముధోల్ మండలంలోని జగదాంబ సేవాలాల్ టెంపుల్ ఎడ్ బిడ్ తండాకు 22 లక్షల 14,311 రూపాయల నిధులు,కుబీర్ మండల కేంద్రంలోని హనుమాన్ టెంపుల్ కు 8,28,494 నిధులు బాసర మండలంలోని దోడాపూర్ గ్రామంలో మహాదేవ్ మందిర కళ్యాణ మండపానికి 22 లక్షల 75 వేల రూపాయల నిధులు, నర్సాపూర్ మండలంలోని గొల్లమాడ బీరప్ప ఆలయ పునర్నిర్మాణానికి 18 లక్షల 33 వేల రూపాయల నిధులు, తానూర్ మండలంలోని హంగిర్గా గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి 32 లక్షల 71,963 రూపాయల నిధుల తో పనులు దక్కించుకోవడం జరిగిందన్నారు. గ్రామ ప్రజల కోరిక మేరకు ఆలయాల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని సంబంధిత శాఖ మంత్రి విన్నవించడంతో నిధులు ఇచ్చారన్నారు. నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి మంత్రులకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన జీవితాన్ని ధార పోసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్

* **జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ : ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92 వ జయంతిని పురస్కరించుకొని, గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి కలెక్టర్ చంద్రశేఖర్ పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను కొనియాడారు. శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్, వివిధ విభాగాల అధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాలు సమర్పించి ఘన నివాళులర్పించారు.

## కాగితరహిత విధానంలోనే ఐఎఫ్ఎంఎస్ బిల్లులు సమర్పించాలి

* **జిల్లా ఖజానా అధికారి సరోజ**



ప్రజా స్ఫూర్తి , భైంసా : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన కాగిత రహిత విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఐఎఫ్ఎంఎస్ ద్వారా పేపర్‌లెస్ బిల్లుల సమర్పణ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని జిల్లా ఖజానా అధికారి సరోజ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ ఆదేశానుసారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధిన బిల్లులన్నిటినీ ఆగస్ట్ 15 వ తేదీ నుండి ఆన్లైన్ లో మాత్రమే సమర్పించాలని ఆమె వివరించారు. ఈ విధానం అన్ని ప్రభుత్వ శాఖలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. జిల్లా లోని అందరూ డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్స్(DDOs) ఇకపై బిల్లులను ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలన్నారు. బిల్లులతో పాటు అవసరమైన స్కాన్ చేసిన ఆధార పత్రాలను తప్పనిసరిగా జత చేయాలి అని తెలిపారు. సమర్పించే పత్రాలన్నీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000 ప్రకారం చెల్లుబాటు అయ్యే డిజిటల్ సంతకంతో ధృవీకరించాలని పేర్కొన్నారు.15 ఆగస్టు 2026 నుంచి ట్రెజరీ కార్యాలయాలకు హార్డ్ కాపీ బిల్లులను ఉగ(కాగిత రూపంలో) సమర్పించరాదని వివరించారు. జిల్లాలోని అన్ని ఉపకోశాధికారి కార్యాలయ అధికారులు (ఎస్టీవో) తమ పరిధిలోని అన్ని కార్యాలయాలకు ఈ ఆదేశాలను తెలియజేసి అమలు చేయాలి అని ఆదేశించారు. ఈ నిర్ణయం ద్వారా బిల్లుల సమర్పణ, పరిశీలన, ఆమోద ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలోనే నిర్వహించబడుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్ళాలి

* **ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కె.పీ. వివేకానంద్**



ప్రజాస్ఫూర్తి , కుత్బుల్లాపూర్ : ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్ళాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కె.పీ. వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్, బౌరంపేట్ సింహపురి కాలనీలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ విగ్రహాన్ని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కె.పీ. వివేకానంద గురువారం ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమన్నారు. "ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వం చారిత్రాత్మక పాత్ర పోషించిందన్నారు. జయశంకర్ సార్ ఆశయాలు, కేసీఆర్ కృషి తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి." అని పేర్కొన్నారు.

## ఘనంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త, ఆర్థికవేత్త, ఉద్యమకారుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా నల్గొండ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ గారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రాంతీయ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆయన విలువలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్,ఏ.ఓ శివ ప్రసాద్,ఎస్బి డిఎస్పీ మల్లారెడ్డి, ఏ.ఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, సీఐ లు,ఆర్.ఐ లు , మినిస్టీరియల్ సిబ్బంది,మహిళా పోలీసు సిబ్బంది,మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ కి ఘన నివాళులర్పించారు.

## వర్షా కాలంలో భువనగిరికి సిబ్బంది కొరత..

* **విద్యుత్, నీటి సరఫరా, పారిశుధ్యంపై కౌన్సిల్‌లో పూజిత జహంగీర్ గళం**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భువనగిరి పట్టణంలో విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్య సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని, ప్రస్తుతం ఉన్న సిబ్బందితో ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడం సాధ్యం కావడం లేదని 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించారు. ప్రజల నుంచి ప్రతిరోజూ పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని, అత్యవసరంగా అన్ని విభాగాల్లో సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సరఫరా విభాగంలో గతంలో తొమ్మిది మంది సిబ్బంది ఉండగా ప్రస్తుతం నలుగురే పనిచేస్తున్నారని, అందులో ఇద్దరు మేస్త్రీలు, ఇద్దరు వర్కర్లు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. 35 వార్డుల్లో ప్రధాన పైప్‌లైన్ లీకేజీలు, పైపులు పగిలిపోవడం, తాగునీటి సరఫరా అంతరాయాలు వంటి సమస్యలు వర్షాకాలంలో మరింత ఎక్కువగా ఎదురవుతున్నాయని, ఈ నలుగురు సిబ్బందితో వాటిని పరిష్కరించడం అసాధ్యమని చెప్పారు. కనీసం తొమ్మిది మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు. పారిశుధ్య విభాగంలోనూ వర్షాల కారణంగా మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోవడం, చెత్త నిల్వలు పెరగడం వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించి కాలువల శుభ్రపరిచే పనులను నిరంతరం నిర్వహించాలని సూచించారు.ప్రజలకు నిరంతర విద్యుత్, తాగునీటి సరఫరా, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం మున్సిపాలిటీ ప్రధాన బాధ్యత అని పేర్కొన్న బర్రె పూజిత జహంగీర్, వర్షాకాల అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలకు వెంటనే ఆదేశాలు జారీ చేసి అదనపు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు తెలంగాణకు శాశ్వత స్ఫూర్తి

* **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు తెలంగాణ సమాజానికి శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘర్ ఘర్ తిరంగా యాత్ర విజయవంతం చేయండి

* **బిజెపి జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్**



ప్రజా స్ఫూర్తి , భైంసా : స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటాలని, ఘర్ ఘర్ తిరంగా యాత్రను విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పిలుపునిచ్చారు. భారతీయులంతా గర్వంగా ఈ యాత్రలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఘర్ ఘర్ తిరంగా యాత్రను విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పిలుపునిచ్చారు. భారతీయులంతా గర్వంగా ఈయాత్రలోభాగస్వాములు కావాలని ఆయన సూచించారు.

**సమావేశంలో పలువురు నాయకుల భాగస్వామ్యం**

గురువారం భైంసా పట్టణంలోని ఎస్.ఎస్. జిన్నింగ్ పరిశ్రమలో నిర్వహించిన సమావేశంలో రితేష్ రాథోడ్ మాట్లాడుతూ, భైంసా పట్టణంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో తిరంగా యాత్రలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణరెడ్డి, రవి పాండే, ఘర్ ఘర్ తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ రావుల రామ్నాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి, జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సాదు ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు రావుల రాము, మండల అధ్యక్షులు సిరం సుష్మారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ ఆలయానికి స్థలం కేటాయించాలి

– **కలెక్టర్‌కు బంజారా సంఘాల జేఏసీ నాయకుల వినతి**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:బంజారాల ఆరాధ్య దైవం అయిన శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణం కోసం ప్రభుత్వం తరపున స్థలం కేటాయించాలని కోరుతూ బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ బృందం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌ను కలిశారు. ఐడీఓసీ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్‌ను కలిసి సేవాలాల్ మహరాజ్ జ్ఞాపికను అందచేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బంజారాల వినతి మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలంలో మూడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆలయ నిర్మాణం కోసం కేటాయించాలంటూ అప్పటి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపడం జరిగిందని చెప్పారు. నేటికీ ప్రభుత్వ స్థలం కేటాయింకపోవడంతో బంజారాలు పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని త్వరితగతిన స్థలం కేటాయించాలని కోరారు. అదేవిధంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఇల్లందు క్రాస్‌రోడ్ సర్కిల్‌లో తెలంగాణ సాయుధ పోరాట వీరుడు ఠాను నాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతినివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ధరావత్ కాన్షీరామ్, మాళోత్ శివ, బానోతు రమేష్. గూగుల్ బద్రు, మాలోత్ అశోక్ బాబు, బానోత్ రవి, సపావట్ బాలకృష్ణ, జె.బి.బాలు, భూక్యా బాబులాల్, భూక్యా శంకర్‌లు పాల్గొన్నారు.

# సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రొఫెసర్ జయశంకర్ కు ఘన నివాళి




సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి :ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా నేడు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ఐపీఎస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం చేసిన కృషి, ఆయన సిద్ధాంతాలు, ప్రజల పట్ల ఉన్న అంకితభావం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

# రాజకీయ పార్టీలతో ఆర్డీవో సమావేశం

* ఓటర్ల జాబితాలు పంపిణీ



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : షాద్‌నగర్ ఆర్డీవో ఎన్ఆర్ సరిత తమ కార్యాలయంలో బుధవారం ఉదయం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం విజయవంతంగా నిర్వహించారు. సమావేశానికి షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డబుల్ ఎలెక్టర్లకు సంబంధించిన జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. అలాగే, సంబంధిత జాబితాలను రాజకీయ పార్టీల వాట్సాప్ గ్రూపుల్లో కూడా షేర్ చేసినట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ అంశంపై కూడా విస్తృతంగా చర్చించారు. కేశంపేట మండలంలో రెండు కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న నాలుగు పోలింగ్ స్టేషన్లకు సంబంధించి కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటును ప్రతిపాదించారు. చౌదర్‌గూడ, కొత్తూరు మండలాల్లో ఓటర్ల సంఖ్య 1,200 దాటిన కారణంగా ఒక్కో కొత్త పోలింగ్ స్టేషన్‌ను ప్రతిపాదించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సహకరించాలని షాద్‌నగర్ ఆర్డీవో, ఎన్నికల నమోదు అధికారి (ERO) విజ్ఞప్తి చేశారు.

# శ్రీ కేఎం పాండు మెమోరియల్ వోకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు షూస్, నోట్ బుక్స్ అందజేత



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : పేద విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయమని శ్రీ కేఎం పాండు మెమోరియల్ వోకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మైమూన్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లిలో గల శ్రీ కేఎం పాండు మెమోరియల్ వోకేషనల్ జూనియర్ కళశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన షూస్, నోట్ బుక్స్ ఆమెతో పాటు వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ నారాయణరావు లు పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మైమూన్ మాట్లాడుతూ కాలేజీ పెట్టిన రోజు నుండి మా విద్యార్థిని విద్యార్థులకు ఏదో రూపంలో ప్రభుత్వం , దాతలు ముందుకు వచ్చి వారికి సకాలంలో కావలసిన అన్ని సదుపాయాలు అందిస్తూ వారి ఉన్నతకి సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీలలో చదివే విద్యార్థినీ విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందుల తో ఉంటారని ప్రభుత్వం వారు ఎంతో సదుద్దేశంతో వారికి అందించిన ఈ షూస్ , నోట్ బుక్స్ ను మంచిగా సద్వినియోగపరచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఉపన్యాసకులు , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# తెలంగాణ ఏర్పాటే తన జీవిత లక్ష్యంగా కృషిచేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్

* తెలంగాణ ఏర్పాటే తన జీవిత లక్ష్యంగా కృషిచేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్..
* రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి . .



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : విద్యార్థి దశ నుండి చనిపోయే వరకు తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో నింపి తెలంగాణపై అవగాహన తీసుకొచ్చిన వ్యక్తి అని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన వ్యక్తుల్లో ప్రొఫెసర్ జయశంకర్ ముందు వరుసలో ఉంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు . ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం నల్గొండలోని ఇందిరా భవన్లో నిర్వహించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలలో మంత్రి పాల్గొని ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతేకాక గద్దర్ వర్ధంతి సందర్భంగా గద్దర్ చిత్రపటానికి కూడా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ కోసమే పుట్టిన వ్యక్తి అని, విద్యార్థి దశనుండే కాకుండా, పదవి విరమణ పొందిన తర్వాత కూడా తెలంగాణ కోసం ఆయన కృషి చేశారని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పలు సందర్భాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ తెలంగాణ తెచ్చుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారని తెలిపారు. శ్రీకాంత్ చారి లాంటి అమరుల బలిదానాలు, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి వారి త్యాగాల ఫలితంగా తెలంగాణ వచ్చిందని చెప్పారు. తెలంగాణ లోని పాలమూరు రంగారెడ్డి, ఇతర ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేసి తెలంగాణను సస్యశ్యామలం చేసినప్పుడే ప్రొఫెసర్ జయశంకర్ ఆత్మకు శాంతి చేకూరుతుందని తెలిపారు. అనంతరం మంత్రి గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని మాట్లాడుతూ తెలంగాణ కోసం కృషి చేసిన వారిలో గద్దర్ ఒకరని, ఆయన తన పాటల ద్వారా తెలంగాణలో ఊరూరా తిరుగుతూ పాటల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారని తెలుపుతూ గద్దర్ కు ఘన నివాళులర్పించారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, గుమ్మల మోహన్ రెడ్డి ,కార్పొరేటర్లు, తదితరులు ఉన్నారు . అనంతరం మంత్రి ప్రజల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు.

# అత్యాధునిక సాంకేతికతే యువత విజయానికి పునాది

: ఎస్పీ సంకీర్త్

* అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌లో శిక్షణా కార్యక్రమాల పరిశీలన



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి, నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను సందర్శించిన ఆయన అక్కడి అత్యాధునిక సాంకేతిక వసతులు, శిక్షణా ప్రయోగశాలలు, విద్యార్థులకు అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడిన ఎస్పీ వారి విద్య, శిక్షణ, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో లక్ష్య సాధనకు కృషి చేస్తే ప్రతి యువకుడు ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు.యువత సిగరెట్, గంజాయి, మత్తు పదార్థాలు తదితర చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్య, నైపుణ్యాభివృద్ధిపైనే దృష్టి సారించి మంచి లక్ష్యాలతో ముందుకు సాగితే జీవితంలో విజయాన్ని సాధించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఏటీసీ ప్రిన్సిపాల్ జుమ్లా నాయక్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ సిబ్బంది, విద్యార్థులు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి

: గద్వాల విజయలక్ష్మి.



జనగామ, ప్రజాస్ఫూర్తి : మహిళల భద్రత, సంక్షేమం, సాధికారత కోసం అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు, బాలికలపై వేధింపులు, గృహహింస, లైంగిక దాడులు, సైబర్ నేరాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు చట్టపరమైన రక్షణ, కౌన్సెలింగ్, వైద్య సేవలు, పునరావాసం వంటి సేవలను ఒకే వేదిక పై అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. షీ టీమ్స్, భరోసా కేంద్రం,సఖి కేంద్రం,జిల్లా న్యాయ సేవల సంస్థ సేవల పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే గర్భస్థ శిశువు లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ కేంద్రాల పై నిరంతర తనిఖీలు నిర్వహించి, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.సమావేశం అనంతరం పలువురు బాధితుల సమస్యలను విన్న ఛైర్‌పర్సన్,వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. సమావేశం లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, మహిళా కమిషన్ సభ్యులు,పోలీసు అధికారులు, జిల్లా న్యాయ సేవల సంస్థ, షీటీమ్స్,భరోసా కేంద్రం,సఖి కేంద్రం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఓపెన్ స్కూల్ ప్రవేశాల లక్ష్యాలను పూర్తి చేయాలి

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ ప్రవేశాలను 17వ తేదీ లోగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన డీసీఈబీ, ఉల్లాస్, టాస్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీఈబీ నూతన కార్యవర్గం పరీక్షల నిర్వహణలో గోప్యత, పారదర్శకత, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ప్రశ్నపత్రాల ముద్రణ నుంచి మూల్యాంకనం వరకు ప్రతి దశలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. చదువు మధ్యలో మానేసిన యువత, మహిళలు, కార్మికులు తదితర అర్హులకు ఓపెన్ స్కూల్ ద్వారా విద్యను కొనసాగించే అవకాశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.ఈ విద్యా సంవత్సరంలో ఎస్ఎస్సీకి 974 మంది, ఇంటర్మీడియట్‌కు 1,396 మంది ,మొత్తం 4,137 మంది విద్యార్థుల ప్రవేశ లక్ష్యాలను మండలాల వారీగా పూర్తి చేయాలని సూచించారు. ప్రవేశాల ఫీజు రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ఉల్లాస్ కార్యక్రమం కింద నిరక్షరాస్యులను గుర్తించి విద్యా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. మిగిలి ఉన్న పాఠశాల యూనిఫాం కుట్టు పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారులు, టాస్, ఉల్లాస్, మెప్మా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టీడబ్ల్యూఎంఎఫ్ తిరుమలాయపాలెం మండల ఇంచార్జీగా గుజ్జ రామకృష్ణ నియామకం.!



పాలేరు, ప్రజా స్ఫూర్తి: తెలంగాణ వార్డు సభ్యుల సంఘం టీడబ్ల్యూఎంఎఫ్ తిరుమలాయపాలెం మండల ఇంచార్జీగా గుజ్జ రామకృష్ణను జిల్లా ఇంచార్జీ గుండా ఉపేందర్ రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మండల ఇంచార్జీ గుజ్జ రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో టీడబ్ల్యూఎంఎఫ్ కమిటీని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. వార్డు సభ్యుల సంక్షేమానికి తోడ్పాటు అందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం బాధ్యతాయుతంగా అందరం కలిసి పని చేస్తామని అన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ఫోరం వ్యవస్థాపకులు నాగబెల్లి జ్యోతి మరియు జిల్లా ఇంచార్జీ గుండా ఉపేందర్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బచ్చోడు 9వ వార్డు సభ్యులు సందు రాజు, కూసుమంచి 5వ వార్డు సభ్యులు మంద నవ్య తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల కు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

* జమేయత్ ఉలేమా ఏ హిందు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యహసానుద్దీన్.



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మైనారిటీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని జమియత్ ఉలేమా ఎ హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షా సయ్యద్ ఎహ్సానుద్దీన్ రషాదీ ఖాస్మీ డిమాండ్ చేశారు.గురువారం జిల్లా కేంద్రంలోని దారుల్ ఉలూమ్ లో మీడియా సమావేశంలో మాట్లాడారు.2023 ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిన మైనారిటీ సంక్షేమ హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని కోరారు.ఆనాటి హామీలను నెరవేర్చకుండా మైనారిటీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ఎద్దేవా చేశారు.మైనారిటీ ఉప ప్రణాళికను అమలు చేసి, మైనారిటీల కోసం ప్రకటించిన రూ.4వేల కోట్ల బడ్జెట్‌ను పారదర్శకంగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేసి కళాశాలలకు నిధులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమియత్ ఉలేమా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మౌలానా మఖ్దూమ్, గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ హాఫీజ్ ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలానా అక్బర్ ఖాన్, జిల్లా కార్యదర్శి హాఫిజ్ ఫుర్కాన్, ముఫ్తీ రియాజ్, మౌలానా జుబైర్, మౌలానా హుస్సేన్, మౌలానా సామీ, ముఫ్తీ ఉమర్, హాఫీజ్ మతీన్, ముఫ్తీ సోహైబ్, హాఫీజ్ హబీబ్, మౌలానా ఫిరాసత్, ఫైసల్, ముఫ్తీ ఘౌస్, హాఫీజ్ షంషుద్దీన్, ముఫ్తీ కలీమ్, మౌలానా అతా ఉర్ రహ్మాన్, మౌలానా ఫారూక్, జానీ, బాబా తదితరులు పాల్గొన్నారు.

# శిశు ఆరోగ్యానికి తల్లిపాలే అమృతం

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: శిశువుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అమృతంతో సమానమని కౌన్సిలర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 48వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం ఎంతో అవసరమన్నారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాలు అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల లక్ష్యాన్ని ప్రతి కుటుంబానికి చేరవేయాలని, తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీల సూపర్వైజర్ అంజలి, అంగన్వాడీ టీచర్స్ నాగలక్ష్మి, అనంతలక్ష్మి, ఆయాలు సోమలక్ష్మి, రేణుక, పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పాలనలో ఆవిష్కరణలతో నాణ్యత పెంచాలి: కలెక్టర్ రాజర్షి షా




ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : దైనందిన విధుల్లో ఎదురయ్యే సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలను అన్వేషిస్తూ, సృజనాత్మక ఆలోచనలతో పాలనలో నాణ్యతను పెంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో అధికారులకు ప్రత్యేక సామర్థ్య పెంపు వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ అధికారులు సాంకేతిక ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించే సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా మార్చడానికి నూతన ఆలోచనలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి శాఖలోనూ సమస్యల పరిష్కారానికి వినూత్న మార్గాలను అన్వేషించాలని, తద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిజిఐసి ప్రతినిధులు వేర్వేరు రంగాల్లో సాధించిన నూతన ఆవిష్కరణలు, వినూత్న పనితీరు విధానాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో జడ్పీ సీఈఓ రవి, డిఆర్‌డిఓ రవీందర్, డిపిఓ రమేష్, టీహబ్ మేనేజర్ అంకిత, జిల్లా కోఆర్డినేటర్ నిఖిని వర్మ, ఈడిఎం రవి, టీవర్క్స్ అసోసియేట్ అరవింద్, జైకా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీ, అగ్‌హబ్ మేనేజర్ ముకేశ్, టీజీఐసీ కమ్యూనికేషన్స్ లీడ్ సాహిల్, గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ లీడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్ BUSINESS

## అదరగొట్టిన ఎల్ఐసీ.. లాభం రూ.13,492 కోట్లు

ఢిల్లీ: ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మెరుగైన త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.13,492 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.10,987 కోట్ల నికర లాభంతో పోలిస్తే 23 శాతం వృద్ధి నమోదైంది. ఎల్ఐసీ మొత్తం ఆదాయం రూ.2,37,848 కోట్లుగా ఉంది. గతేడాది ఇదే సమయంలో రూ.2.22 లక్షల కోట్లుగా ఉన్నట్లు ఎల్ఐసీ తన




రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో తొలి ఏడాది ప్రీమియంలు వసూళ్లు రూ.7,525 కోట్ల నుంచి రూ.9217 కోట్లకు పెరిగాయని ఎల్ఐసీ తెలిపింది. రెన్యువల్ ప్రీమియం వసూళ్లు రూ.59,885 కోట్ల నుంచి రూ.61,833 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. సింగిల్ ప్రీమియం ద్వారా రూ.56,369 కోట్లు వసూలైనట్లు తెలిపింది. మొత్తం ఖర్చులు రూ.2.11 లక్షల కోట్ల నుంచి రూ.2.25 లక్షల కోట్లకు పెరిగినట్లు ఎల్ఐసీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. తొలి త్రైమాసికంలో వ్యక్తిగత సెగ్మెంట్‌లో 31.02 లక్షల పాలసీలు విక్రయించినట్లు ఎల్ఐసీ తెలిపింది. లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌లో తొలి ఏడాది ప్రీమియం ఆదాయం విషయంలో ఎల్ఐసీ 60.1 శాతం మార్కెట్ వాటాతో అగ్రగామిగా ఉందని కంపెనీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి వెల్లడించారు.

## పీపీఎఫ్ వ్యవధి ముగుస్తుంటే...

మన దేశంలో అందుబాటులో ఉన్న సురక్షిత పొదుపు పథకంలో అత్యంత విశ్వసనీయమైన దీర్ఘకాలిక పథకం...ప్రజా భవిష్య నిధి(పీపీఎఫ్). ఈ ఖాతా 15 ఏళ్ల కాలపరిమితిని పూర్తి చేసుకోవడం అనేది ఒక ముఖ్యమైన మైలురాయి. పన్ను రహితంగా భారీ మొత్తం చేతికి అందే ఈ నిధిని ఎలా నిర్వహించాలనేది భవిష్యత్తు అవసరాలపై ఆధారపడి ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత ఖాతాను పూర్తిగా రద్దు చేసుకోవడం కాకుండా, మదుపరుల ముందు మూడు స్పష్టమైన ఎంపికలూ అందుబాటులో ఉన్నాయి..

సంపూర్ణ ఉపసంహరణ: ఖాతా 15 ఏళ్లు పూర్తి కాగానే, వడ్డీతో సహాజమైన మొత్తం నిధిని ఉపసంహరించుకోవచ్చు. పిల్లల ఉన్నత చదువులు, వివాహం లేదా ఇల్లు కొనుగోలు వంటి తక్షణ ఆర్థిక అవసరాలు ఉన్నవారికి ఇది సరైన మార్గం. అంతేకాకుండా, ఈ నిధిని ఇతర లాభదాయకమైన పెట్టుబడి సాధనాల్లోకి మళ్లించాలనుకునే వారూ ఈ ఎంపికను ఎంచుకోవచ్చు.

కొత్త పెట్టుబడులతో పొడిగింపు: తక్షణ నగదు అవసరం లేని వారు అయిదేళ్ల వ్యవధి చొప్పున ఖాతాను పొడిగించుకోవచ్చు. ఇందులో యథావిధిగా కొత్త పెట్టుబడులు చేయొచ్చు. దీనివల్ల చక్రవడ్డీ ప్రభావంతో నిధి మరింత వేగంగా పెరుగుతుంది. మార్కెట్ హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా ప్రభుత్వం నిర్ణయించే స్థిరమైన వడ్డీ రేటు ఇక్కడ లభిస్తుంది. కాబట్టి, పదవీ విరమణ కోసం పెద్ద మొత్తాన్ని సమకూర్చుకోవాలని భావించే వారు దీన్ని పరిశీలించవచ్చు.

నగదు జమ చేయకుండా: కొత్తగా నగదు జమ చేయలేం అనుకునే వారు, కేవలం ఉన్న నిధిని ఖాతాలోనే ఉంచి, వడ్డీని పొందే సౌకర్యమూ ఉంది. ఇందులో క్రమం తప్పకుండా




డిపాజిట్లు చేయాల్సిన అవసరం లేదు. ఖాతాలోని నిల్వపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటించే వడ్డీ రేటు వర్తిస్తూనే ఉంటుంది. సురక్షితమైన ప్రభుత్వ హామీగల సాధనాల్లో తమ నిధిని దాచుకోవాలని భావించే వారికి ఇది అనుకూలం.

**పన్ను ప్రయోజనాలతో..**

పీపీఎఫ్ పెట్టుబడులకు పన్ను మినహాయింపు ఉంటుంది. వచ్చే వడ్డీకి పన్ను ఉండదు. గడువు తీరిన తర్వాత తీసుకునే మొత్తం నిధిపైనా ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఈ మూడు దశల్లోనూ ఆదాయపు పన్ను నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుందన్నమాట. ఇది సాధారణ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే అధిక లాభదాయకతను అందిస్తుంది. ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి వడ్డీ రేట్లను సమీక్షిస్తుంటుంది. ఈ మార్పులు పెట్టుబడిదారుల దీర్ఘకాలిక ద్రవ్యోల్బణ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయో లేదా అన్నది గమనిస్తూ ఉండాలి. మీ పీపీఎఫ్ ఖాతా గడువు సమీపిస్తుంటే.. వెంటనే పోస్టాఫీసుకెళ్లి మీరు ఏం చేయాలనుకుంటున్నారో చెప్పండి. ఫారం హెచ్, ఇతర అవసరమైన పత్రాలు సమర్పించండి.

## అప్పర్‌లేయర్ NBFCగా టాటా సన్స్.. లిస్టింగ్‌పై రాని స్పష్టత!

ముంబయి: టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుర్తించింది. దీంతో పాటు మరో 16 కంపెనీలనూ అప్పర్ లేయర్ జాబితాలో చేర్చింది. ప్రభుత్వరంగానికి చెందిన ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్ఎఫ్‌సీ, హడ్కోతో పాటు, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరామ్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్ ఆ జాబితాలో ఉన్నాయి. జూన్ 1 నుంచి వచ్చిన నిబంధనల ప్రకారం.. రూ.లక్ష కోట్లు ఆస్తులు కలిగిన ఎన్‌బీఎఫ్‌సీని అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా పరిగణిస్తారు. 2026 మార్చి నాటికి టాటా సన్స్ ఆస్తుల విలువ రూ.2 లక్షల కోట్లకు పైబడి ఉండడంతో దీన్ని అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తించింది. ఇలా గుర్తింపు పొందిన కంపెనీ మూడేళ్లలోపు స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాల్సి ఉంటుంది. టాటా గ్రూప్ కంపెనీలకు ఎన్‌బీఎఫ్‌సీ కేటగిరీలో టాటా సన్స్ ప్రధాన పెట్టుబడి కంపెనీగా ఉంది. లిస్టింగ్ నుంచి తప్పించుకోవడం కోసం పెట్టుబడి కంపెనీగా డీరిజిస్టర్ చేయాలంటూ టాటా సన్స్ గతంలో ఆర్‌బీఐకి దరఖాస్తు చేసుకుంది. ఈ దరఖాస్తు ఇంకా పరిశీలనలోనే ఉందని ఆర్‌బీఐ తాజాగా పేర్కొంది. దీనికి ఆర్‌బీఐ ఆమోదించేది లేనిదీ దాన్ని బట్టి లిస్టింగ్ ఆధారపడి ఉంటుంది. లిస్టింగ్‌పై తలోమాట: టాటాసన్స్ లిస్టింగ్ విషయంలో టాటా ట్రస్ట్స్‌లోనే విభేదాలు ఉన్నాయి. ఛైర్మన్ నోయల్ టాటా లిస్టింగ్‌కు వ్యతిరేకంగా ఉండగా.. వైస్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ మద్దతుగా ఉన్నారు. అప్పులు చెల్లించుకోవడం కోసం ఎప్పటి నుంచో టాటా సన్స్




లిస్టింగ్‌ను ఎస్‌పీ గ్రూప్ డిమాండ్ చేస్తూ వస్తోంది. లిస్టింగ్ వల్ల సంస్థపై ట్రస్ట్ నియంత్రణ తగ్గి, బయటి వ్యక్తుల జోక్యం పెరుగుతుందనేది ట్రస్ట్ ఛైర్మన్ నోయల్ టాటా, మరికొందరు ట్రస్టీల ఆందోళన.

## యూపీఐపై ఛార్జీలు.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

ఢిల్లీ: యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించడానికి ఉద్దేశించిన 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007' సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఇక డిజిటల్ లావాదేవీలపై బ్యాంకులతో పాటు ఇతర ఫిన్‌టెక్ సంస్థలకు ఛార్జీలు వసూలు చేసే అధికారం ఈ బిల్లు కల్పించనుంది. ఎలాంటి చర్చా లేకుండానే ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. వాయిస్ ఓటు ద్వారా లోక్‌సభలో పాస్ అయ్యింది. యూపీఐ సహా కొన్ని ఎలక్ట్రానిక్ పేమెంట్లపై మర్చంట్ డిస్కౌంట్ రేటును బ్యాంకులు, సర్వీసులు ప్రొవైడర్లు వసూలు




చేయకుండా ఇప్పటి వరకు చట్టపరమైన నిబంధన ఉంది. ఈ బిల్లుతో ఇది తొలగనుంది. ప్రస్తుతం RTGS, NEFT ద్వారా జరిపే రియల్ టైం లావాదేవీలపై బ్యాంకులు సర్వీస్ ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. యూపీఐ లావాదేవీలకు మాత్రం మినహాయింపు ఉంది. దీన్ని తాజాగా తొలగించారు. వినియోగదారులు, చిన్న వ్యాపారాల కోసం డిజిటల్ చెల్లింపు సేవలపై చిన్న రుసుము విధించడంతో పాటు, డిజిటల్ చెల్లింపుల పర్యావరణ వ్యవస్థను నడిపించే బ్యాంకులు, చెల్లింపు సర్వీస్ ప్రొవైడర్లు, పేమెంట్ ఇన్‌ఫ్రా సంస్థలకు ఆదాయాన్ని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో నిర్దిష్ట పరిమితి దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించే అవకాశం ఉంది. ఈ ఛార్జీలు పెద్ద వ్యాపారులకే వర్తిస్తాయి. సాధారణ వినియోగదారులకు వర్తించవు.

## తొలి రోజు నుంచే ప్రతి సవాలుకు జవాబు ఇద్దాం: గౌతమ్ గంభీర్

మొన్నటి వరకు వన్డేలు, టీ20లు ఆడిన భారత జట్టు ఇప్పుడు టెస్టు ఫార్మాట్‌లో తలపడేందుకు సిద్ధమైంది. ఇప్పటికే శ్రీలంకకు చేరుకొన్న టీమ్ఇండియా.. ఆ జట్టుతో రెండో టెస్టుల సిరీస్‌ను ఆడనుంది. ఆగస్టు 15 నుంచి గాలె వేదికగా మొదటి టెస్టు ప్రారంభం కానుంది. దానికంటే ముందు.. శుక్రవారం నుంచి మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఈ క్రమంలో టీమ్ఇండియా ఆటగాళ్లకు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కీలక సూచనలను చేశాడు. ఆ వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. ''మన ముందు ఏ లక్ష్యం ఉందో మనకు తెలుసు. ఎందుకోసం ఆడుతున్నామో తెలుసు. పరిమితులను అధిగమించగలం. ఏదైనా సాధించగలం. అన్ని విభాగాల్లోనూ సత్తా చూపించగలం. బ్యాటింగ్, బౌలింగ్ ఏదైనా సరే.. ఆగస్టు 15 ఉదయం నుంచి మనకు ఎదురయ్యే ప్రతి సవాలుకు జవాబు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలి. ఇప్పట్నుంచే అందుకోసం సన్నద్ధమవుదాం. ఇప్పుడు మనతోపాటు ఇద్దరు కొత్త ప్లేయర్లు ఉన్నారు.




వారిద్దరికి శుభాకాంక్షలు చెబుతున్నా. సరాంశ్ ఇక్కడి వరకు వచ్చేందుకు చాలా కష్టపడ్డావు. ఎప్పుడు అవకాశం వచ్చినా దేశం, కుటుంబం గర్వపడేలా చేస్తావని ఆశిస్తున్నా. ఇక ఆకిబ్ నబీకి స్వాగతం. గత సీజన్‌లో అదరగొట్టావు. జమ్ముకశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీని నెగ్గడంలో కీలక పాత్ర పోషించావు. ఇక, మనతోపాటు పనిచేసేందుకు శుభదీప్ ఘోష్ (ఫీల్డింగ్ కోచ్) వచ్చారు. చాలా జట్లతో గత కొన్నేళ్లుగా ఆయన వర్క్ చేశారు. ఆయన నిబద్ధత, ఎనర్జీ లెవల్స్ అద్భుతం. తన ప్రతిభతో మనందరిని లక్ష్యం దిశగా తీసుకెళ్తారని ఆశిస్తున్నా'' అని గౌతమ్ గంభీర్ వ్యాఖ్యానించాడు.




## మహిళల ఆసియా కప్ 2026..
## భారత్, పాక్ మ్యాచ్ ఎప్పుడంటే?

మహిళల ఆసియా కప్ 2026 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను గురువారం అధికారికంగా విడుదల చేశారు. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీ ఆగస్టు 28న మొదలై సెప్టెంబర్ 13న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటాయి. గ్రూప్ ఎలో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్‌తోపాటు థాయ్‌లాండ్, హాంకాంగ్ చైనా.. గ్రూప్ బిలో శ్రీలంక, బంగ్లాదేశ్, యూఏఈ, ఇండోనేసియా ఉన్నాయి. టీమ్ఇండియా తొలి మ్యాచ్‌ను ఆగస్టు 30న థాయ్‌లాండ్‌తో ఆడనుంది. సెప్టెంబర్ 5న చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి. టోర్నీలో అన్ని మ్యాచ్‌లు దుబాయిలోనే జరగనున్నాయి. మహిళల ఆసియా కప్ ఇప్పటివరకు తొమ్మిదిసార్లు జరగ్గా.. భారత్ అత్యధికంగా ఏడుసార్లు (2004, 2005-06, 2006, 2008, 2012, 2016, 2022) విజేతగా నిలిచింది. బంగ్లాదేశ్ (2018), శ్రీలంక (2024)




టైటిల్‌ను దక్కించుకున్నాయి. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌పై టీమ్ఇండియాకు తిరుగులేని రికార్డు ఉంది. 2012, 2016లో పాక్‌ను ఓడించే భారత్ టైటిల్ సొంతం చేసుకుంది. ఈ టోర్నమెంట్‌ను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించినప్పుడు పాక్ ఒక్కసారి మాత్రమే (2022) భారత్‌పై విజయం సాధించింది. ఈ ఏడాది జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్‌ను భారత్ 64 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది.

## సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వెళ్లిన క్రికెటర్లు బరువు పెరుగుతున్నారా..?

ఆటగాళ్ల గాయాల విషయంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (COE) తీరుపై విమర్శలు వస్తున్నాయి. అక్కడికి వెళ్లిన ఆటగాళ్లు బరువు అధికంగా పెరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. హర్షిత్ రాణా సీవోఈకి వెళ్లాక నాలుగు కేజీల బరువు పెరిగాడట. దీనివల్లే అతడు ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ సమయంలో గాయపడినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై వివరణ ఇవ్వాలని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అడిగినట్లు కథనాలు వస్తున్నాయి. మరోవైపు యోయో టెస్టు స్థానంలో అమలు చేస్తోన్న బ్రాంకో టెస్టుపైనా బీసీసీఐ పెద్దలు అసంతృప్తితో ఉన్నట్లు




సమాచారం. దీంతో సీవోఈలో పెను మార్పులకు క్రికెట్ బోర్డు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలుస్తోంది. కారణమేంటి కమలేశ్? ఆటగాళ్ల ఫిట్‌నెస్ ప్రమాణాలు పడిపోవడానికి గల కారణాల గురించి చీఫ్ ఫిజియో కమలేశ్ జైన్‌పై బీసీసీఐ ప్రశ్నల వర్షం కురిపించినట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇంగ్లాండ్ పర్యటన సమయంలో పలువురు ప్లేయర్లు కండరాలు పట్టేయడం వంటి సమస్యతో బాధపడ్డారు. అలాగే అధిక బరువుతో ఉన్నప్పటికీ హర్షిత్‌కు క్లీన్‌చీట్ ఇవ్వడంపైనా ఆగ్రహం వ్యక్తమైంది. ''ఆటగాడి స్థాయిని చూసి కంగారు పడాల్సిన అవసరం లేదు. సంతృప్తిగా అనిపించని అంశాలను నిర్భయంగా ప్రస్తావించాలని కమలేశ్‌కు బీసీసీఐ పెద్దలు సూచించారు. ఎందుకంటే కొందరి ఆటగాళ్ల కదలికలు మైదానంలో సరిగ్గా లేవనిపించింది. మరీ ముఖ్యంగా సీనియర్ బ్యాటర్లు ఎక్కువ సమయం క్రీజ్‌లో ఉంటే.. వికెట్ల మధ్య వేగంగా పరిగెత్తడంలో ఇబ్బంది పడుతున్నారు. ఫీల్డింగ్‌లో వేగంగా ఉండేవారి సంఖ్య తగ్గిపోయింది. ఇక హర్షిత్ రాణా బరువు 4 కిలోలు ఎక్కువగా ఉందని మేనేజ్‌మెంట్ గుర్తించింది. ఈ విషయంలో సీవోఈ మరింత అప్రమత్తంగా ఉండాల్సింది. అతడి బరువు 96 కిలోలకు మించకూడదని సిబ్బంది ఇప్పుడు సూచించారు. ప్రస్తుతం 94 కేజీల బరువుతో ఉన్నాడు. అయితే, ఇంగ్లాండ్ పర్యటనకు అతడిని ఎంపిక చేసినప్పుడు బరువు 97 కేజీల వరకూ ఉంది. దీనిపైనా చీఫ్ ఫిజియోను బీసీసీఐ వివరణ కోరింది'' అని బోర్డు వర్గాలు తెలిపాయి.

## షెడ్యూల్ మారింది..
## సౌతాఫ్రికా టూర్‌లో టీ20లు కూడా..

ఈ ఏడాది చివర్లో భారత మహిళల జట్టు సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో టీమ్ఇండియా.. సఫారీలతో ఒక టెస్టు, మూడు వన్డేలు ఆడేలా ముందుగా షెడ్యూల్ రూపొందించారు. తాజాగా ఈ షెడ్యూల్ సవరించి మూడు టీ20లు జోడించినట్లు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు గురువారం తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తొలి ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించనున్నారు. టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఈ సిరీస్ ఇరుజట్లకు ఈ టీ20 సిరీస్ సన్నాహకంగా ఉపయోగపడనుందని సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు వివరించింది. సవరించిన షెడ్యూల్




ప్రకారం.. సౌతాఫ్రికా, భారత్ డిసెంబరు 9-12 మధ్య ఏకైక టెస్టు మ్యాచ్‌లో తలపడనున్నాయి. అదే నెల 16-22 మధ్య వన్డే సిరీస్, 26-30 మధ్య టీ20 సిరీస్ నిర్వహించనున్నారు. టెస్టు మ్యాచ్‌కు గెబెరా, వన్డేలకు పార్ల్, కేప్ టౌన్, బ్లోమ్‌ఫోంటైన్ ఆతిథ్యమివ్వనున్నాయి. తొలి టీ20 బెనోనిలో, మిగిలిన రెండు టీ20లు పోచెఫ్‌స్ట్రూమ్‌లో జరగనున్నాయి.

## కామన్వెల్త్‌లో స్వర్ణం నెగ్గినా.. ఆమెకు రివార్డ్ మాత్రం కష్టమే!

కామన్వెల్త్ గేమ్స్‌లో ఆమె బంగారు పతకం గెలిచింది. అదేమీ ఆషామాషీ మెడల్ కాదు. భారత జూడో చరిత్రలోనే తొలి స్వర్ణాన్ని దక్కించుకుంది. మరి అలాంటి అథ్లెట్‌పై రివార్డుల వర్షం కురవాలి. కానీ, ఆమెకు మాత్రం ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. రివార్డు అందుకోవాలంటే మూడు అడ్డంకులను దాటాల్సిన అవసరం ఏర్పడింది. కామన్వెల్త్ గేమ్స్‌లో 48 కేజీల విభాగంలో అస్మిత డే పసిడి పతకం నెగ్గిన సంగతి తెలిసిందే. 23 ఏళ్ల అస్మిత త్రిపుర వాసి. అయితే,



జూడోలో మాత్రం ఆమె ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఇదే ఇప్పుడు ఇబ్బందిగా మారింది. యూపీలో అథ్లెట్లకు రివార్డులను అందించడం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం 2024లో మూడు ప్రమాణాలను నిర్దేశించింది. ఆ నిబంధనల ప్రకారం అర్హత సాధిస్తే అస్మిత రూ. 1.50 కోట్ల నజరానాను అందుకోనున్నారు.



## నవంబర్ 6న రామాయణ విడుదల

'రామాయణ'.. ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రమిది. ఈ సినిమాలో శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్న సంగతి తెలిసిందే. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో రణబీర్ కపూర్ సరసన యష్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది నవంబర్ 6న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు సోనీ పిక్చర్స్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. అయితే ఈ మూవీకి సంబంధించిన ఇంగ్లీష్ డబ్బింగ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. సుమారు రూ. 1400 నుండి రూ. 1500 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ రామాయణలో రణబీర్ కపూర్ రాముడిగా, యశ్ రావణుడిగా, సాయిపల్లవి సీతగా, సన్నీ డియోల్ హనుమాన్‌గా, రవి దూబే లక్ష్మణుడిగా నటిస్తున్నారు.

## చరణ్‌తో ఎన్టీఆర్ బ్యూటీ రొమాన్స్?



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న 'RC17' చిత్రంపై అంచనాలు రోజురోజుకూ ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే కీలక నటీనటుల ఎంపిక పూర్తి కాగా, తాజాగా హీరోయిన్‌ను ఫైనల్ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. రామ్‌చరణ్ సరసన రుక్మిణి వసంత్ నటించబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆమెను సంప్రదించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాలు చేస్తోంది రుక్మిణి. ఎన్టీఆర్ సరసన డ్రాగన్ సినిమాలో నటిస్తోంది. ఆమె చేసిన టాక్సిక్ సినిమా విడుదలకు సిద్ధమైంది. ఇప్పుడు చరణ్–సుక్కూ సినిమా ఆఫర్ కూడా ఆమెను వరించేలా ఉంది. సుకుమార్ సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు కూడా మంచి ప్రాధాన్యత ఉంటుంది. దీని కోసం రుక్మిణి వసంత్‌తో పాటు మరో హీరోయిన్ పేరు కూడా అనుకుంటున్నా రు. కాకపోతే ఇంకా ఎవ్వర్నీ ఫైనల్ చేయలేదని సమాచారం.

## ఆయన కోసమే..



బిగ్‌బాస్ ఫేమ్ డెమాన్ పవన్, రీతూ చౌదరి జంటగా నటించిన బంగారం ఆల్బమ్ సాంగ్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ సాంగ్ లాంఛ్ ఈవెంట్‌లో పాట సక్సెస్‌పై రీతూ తన అభిప్రాయాలను ఫ్యాన్స్‌తో పంచుకుంది. ఈ పాటలో భాగం కావడం సంతోషంగా ఉంది. డెమాన్ పవన్ కోసమే ఈ సాంగ్ చేశాను. పవన్ ఎంతో ప్యాషన్‌తో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిం చారు. షూటింగ్ మొత్తం చాలా సరదాగా జరిగింది. ఈ ప్రయా ణంలో తనూజ, అఖిల్, నిసర్గ చాలా దగ్గరయ్యారు. డైరెక్టర్, మ్యూజిక్ టీమ్, టెక్నీషియన్స్ అందరూ సపోర్ట్ చేశారు. అందుకే ఈ పాట ఇంత అందంగా వచ్చింది. మీ అందరి ప్రేమాభిమా నాలు ఇలాగే మాపై ఉండాలని ఆశిస్తున్నాను. థ్యాంక్యూ సో మచ్ అంటూ చెప్పుకొచ్చింది రీతూ. అఫ్రోజ్ అలీ సాహిత్యం అందించడంతో పాటు స్వరపరిచి, స్వయంగా ఆలపించారు. రంజిత్ రెడ్డి మ్యూజిక్ అందించారు.

## మై వాపస్ ఆవుంగా..




- **నెట్ ఫ్లిక్స్‌లో ఈ అర్ధరాత్రి నుంచే..**

భారత విభజన నాటి చేదు జ్ఞాపకాలు, ఒక అసంపూర్ణ ప్రేమకథ ఆధారంగా దర్శకుడు ఇంతియాజ్ అలీ తెరకెక్కించిన చిత్రం 'మై వాపస్ ఆవూంగా. థియేటర్లలో ప్రేక్షకులను అలరించి.. భావోద్వేగంతో కట్టిపడేసిన ఈ ప్రేమ కథ.. ఈ అర్ధరాత్రి నుంచి ఓటీటీల్లో సందడి చేయనుంది. ఆగస్టు 7న మై వాపస్ ఆవుంగా మూవీ నెట్ ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. నసీరుద్దీన్ షా, దిల్జీత్ దొసాంజ్, వేదాంగ్ రైనా, శర్వరి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఈ మూవీని రూ. 70 కోట్ల బడ్జెట్‌తో చిత్రీకరించగా, బాక్సాఫీస్ దగ్గర రూ. 97.37 కోట్లు వసూలు చేసింది. మై వాపస్ ఆవుంగా మూవీతో పాటు.. ఆపరేషన్ సఫేద్ సాగర్ కూడా ఓటీటీల్లో అలరించనుంది. ఈ చిత్రం కూడా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. ఈ మూవీలో సిద్ధార్థ్, జిమ్మీ షేర్గిల్, అభయ్ వర్మ నటించారు. ఓనీ సేన్ దర్శకత్వంలో కార్గిల్ యుద్ధంలో భారత వైమానిక దళం పోషించిన వీరోచిత పాత్ర ఆధారంగా ఈ వెబ్ సిరీస్ రూపొందింది.

## రేపే మకుటం ట్రైలర్ విడుదల



సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడి గా చేస్తున్న చిత్రం 'మకుటం'. ఇందులో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి ఇప్పటి వరకు వచ్చిన టీజర్, పాటలు పెద్ద హైప్‌ను క్రియేట్ చేశాయి. మ్యూజికల్ ప్రమోషన్స్ జోరందుకున్న తరుణంలో మేకర్లు మరో అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. ఈ మూవీని ఆగస్ట్ 14న థియేటర్లలో రిలీజ్ చేయబోతోన్నట్లు ప్రకటించారు. రేపే ట్రైలర్‌ను విడుదల చేస్తామని పేర్కొన్నారు. విశాల్ డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తుండటం ఆస క్తిని రేపుతోంది. జీవీ ప్రకాష్ అందించిన మ్యూజిక్ తెగ ఆకట్టుకోవడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. బి.సురేష్, ఆర్.బి. జీవన్ చౌదరి, జితన్ రమేష్, జీవా నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.